www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 27 ఆగస్టు 2023

రేపు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నగరి నుంచి జగనన్న విద్యాదీవెన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అందరూ ఈ పర్యటనలో నిమగ్నమై ఉన్నందున జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరిగే గ్రీవెన్స్ డేను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులందరూ గమనించి వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లకు

ఉచిత విద్యుత్ ఇవ్వాలి : సిపిఎం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- నగరి: నగరి నియోజకవర్గంలో ఉన్న పవర్లూమ్ కార్మికులకు 500 యూనిట్లకు ఉచితవిద్యుత్ ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం కూలి రేట్లు ఇవ్వాలని, నగరి సభలో సీఎం స్పందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరుగుతున్న సమరభేరి పోస్టర్‌ను శనివారం నగరి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ప్రజలపై భారాలు వేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పవర్లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేస్తానని చెప్పిన వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల తర్వాత కూడా ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమిళనాడు తరహాలో 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేలాది మంది పవర్లూమ్ కార్మికులు కూలి రేట్లు పెంచాలని, పెద్దఎత్తున పోరాటం చేయగా అన్నిరకాల అధికారుల సమక్షంలో ఒప్పందమైన కూలీలు రేట్లు కూడా సంవత్సరం అవుతున్నా పెంచకపోవడం దుర్మార్గమన్నారు. నగరి పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పవర్లూమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నగరి సిపిఎం కార్యదర్శి పెరుమాళ్ మాట్లాడుతూ పవర్లూమ్ కార్మికుల సమస్యలపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పలమనేరు: దేశవ్యాప్తంగా ఈనెల 30 నుండి సెప్టెంబరు 4వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ ప్రకటించారు. శనివారం ఉదయం సిపిఎం పలమనేరు పట్టణ కార్యాలయంలో పార్టీ పట్టణశాఖ కార్యదర్శి అన్సార్ ఈశ్వర్ సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిధర్ గుప్తా, ఈశ్వర్ మాట్లాడుతూ అదానీకి లాభాల కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటీకరించి ప్రజలకు తెలియకుండానే ట్రూఅప్ ఛార్జీలు, వినియోగపు ఛార్జీలు, ఫిక్సిడ్ ఛార్జీల పేరుతో భారీగా పెంచి భారాలు మోపిందన్నారు. నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. పుండుమీద కారం చల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను, చెత్తపన్ను, మంచినీటి ఛార్జీలు, యూజర్ ఛార్జీల పేరుతో భారీగా పన్నులు పెంచి ప్రజల నడ్డివిరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు అదుపుచేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. ఆగష్టు 30, 31 తేదీల్లో నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టి ప్రజల నుండి సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించామన్నారు. సెప్టెంబరు 1న సచివాలయాల వద్ద నిరసనలు, సెప్టెంబరు 4న ఎమ్మార్వో ఆఫీస్‌ల వద్ద ధర్నాలు చేపట్టాలని సిపిఎం పిలుపునిచ్చిందని ప్రకటించారు. ఈకార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకురాలు యశస్విని, పార్టీ సభ్యురాలు ధనమ్మ, చందు, గుర్రం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేపు అసైన్డ్ చట్టసవరణపై అవగాహన సదస్సు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- కుప్పం: పట్టణంలో సోమవారం జరగనున్న అసైన్డ్ చట్టసవరణ అవగాహన సభను జయప్రదం చేయాలని స్థానిక రైతు సంఘాలు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు అసైన్డ్ భూములకు సంబంధించిన చట్టవివరణతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసైన్డ్ చట్టం ప్రకారం దళిత, గిరిజన, పేద వర్గాలు ఇప్పటికే అసైన్డ్ భూములను దున్నుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ఆశయం భూముల చట్టసవరణ వల్ల తిరిగి దళిత, గిరిజన, పేదవర్గాలు భూమిలేని నిరుపేదలుగా మారే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టసవరణలు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే దళిత, గిరిజన, పేదవర్గాల అభ్యున్నతికి చట్టసవరణ తీసుకురావాలని కోరారు. ఈ విషయాలపై 28వ తేదీ సోమవారం పట్టణంలోని రాజావారి పార్కులో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక గిరిజన, దళిత, పేద వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'జిల్లా స్థాయి అవార్డులకు వివరాలు పంపండి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వచ్చేనెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు వివరాలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అవార్డు కోసం 10 సంవత్సరాలు అనుభవం కలిగి, తాము అందించిన సెవులను తెలియజేస్తూ ఈనెల 31వ తేది సాయత్రం ఐదు గంటల లోపు మండల విద్యాశాఖాధికారి, డిప్యూటీ విద్యాశాఖాధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు తగిన నమూనాలతో వివరాలు సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తరువాత వివరాలను స్వీకరించబడవని పేర్కొన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, కలెక్టర్

ప్రజాశక్తి- నగరి:
ఈనెల 28న జగనన్న విద్యా దీవెన పథకాన్ని నగరి నుండి సీఎం జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ముఖ్యమంత్రి పర్యటనల సలహాదారు, ఎమ్మెల్సీ తలశీల రఘురాం, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్పీ వై. రిశాంత్ రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం వరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తిచేయవలసిన పనులపై ఆరాతీశారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నగరి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు సమర్థవంతంగా చేస్తున్నారన్నారు. హెలిప్యాడ్, బహిరంగ సభ వద్ద ఏర్పాట్లు శరవేగంగా జరుగుతోందన్నారు. ఎక్కడా ఎలాంటి లోటు రాకుండా పకడ్బంధీగా సభ నిర్వహించాలన్న అంశంపై సమీక్షించారు. వీరితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎంఎల్‌సి సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు శాసనసభ్యులు ఆదిమూలం, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, నగరి ఆర్డీఓ సుజన తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై సమావేశమైన మంత్రులు, కలెక్టర్

ప్రణాళికా బద్ధంగా సీఎం పర్యటన
నగరి పట్టణంలతో సీఎం పర్యటన వివరాలపై కలెక్టర్ షగిలి షన్మోహన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగనన్న విద్యా దీవెన ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికం కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 28న ఉదయం 10.15 గంటలకు నగరిలోని కీళపట్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని తెలిపారు. అనంతరం హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గాన సభా వేదికకు చేరుకొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించి లబ్ధిదారులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. అనంతరం కంప్యూటరు బటన్ నొక్కి జగనన్న విద్యా దీవెన లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారన్నారు. మధ్యాహ్నం 1.25 గంటలకు నగరి డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు.

భద్రతా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

భద్రత ఏర్పాట్లపై అధికారుల సమీక్ష
ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏఎస్-ఎల్ (అడ్వాన్స్ సెక్యూరిటీ లైసెన్) నిర్వహణ, హెలిపాడ్, సభావేదిక వద్ద ముఖ్యమంత్రి భద్రతపై ఉన్నత స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ షగిలి షన్మోహన్, జిల్లా ఎస్పి వై.రిశాంత్ రెడ్డి శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఉన్నతాధికారులు మాట్లాడుతూ బందోబస్తు పటిష్టంగా ఉండాలని పోలీసులకు సూచనలు చేశారు. సీఎం తిరుగు ప్రయాణం అయ్యే వరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య శాఖ వారు స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులన్స్, సేఫ్ హౌస్, సేఫ్ హాస్పిటల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫైర్ అధికారులు ఫైర్‌సేఫ్టీకి చేపట్టవలసిన చర్యలు, ఫుడ్ సేఫ్టీపై సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి

యథావిధిగా రోజువారీ వ్యాపారాలు: కమిషనర్
ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నగరి పట్టణంలో షాపులు మూసివేయాలంటూ పుకార్లు వస్తుండటంపై మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి స్పందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి ఈనెల 28న నగరి పట్టణానికి వస్తున్నారని ఈపర్యటనలో రోజువారీ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేవని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని దుకాణదారులు, వ్యాపారస్థులు దుకాణాలు మూసివేయాల్సిన అవసరం లేదని వారి విధులను వారు యథావిధిగా నిర్వహించుకోవచ్చన్నారు.

రూ.70లక్షల నిధులతో సిసి రోడ్లు ప్రారంభం

ఎమ్మెల్యే వెంకటే గౌడను సన్మానిస్తున్ననాయకులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని దేవదొడ్డి సచివాలయ పరిధిలోనిగుంత కురుప్పల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిని లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్స్‌ను అందజేశారు. అలాగే ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యల అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన పలమనేరు- కుప్పం జాతీయ ప్రధాన రహదారి నుండి గుంత కురుప్పల్లి గ్రామానికి రూ.29లక్షల నిధులతో పూర్తయిన సిసి రోడ్డును పలమనేరు- కుప్పం జాతీయ ప్రధాన రహదారి నుండి మిట్టకురుప్పల్లి గ్రామానికి రూ.70 లక్షల నిధులతో పూర్తియిన సిసి రోడ్డు ప్రారంభించారు. కైగల్, మొగిలి పదరేవులు, కామినేనపల్లి గ్రామాల్లో పర్యటించారు. కామినేపల్లి గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సర్పంచ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మొగసాల రెడ్డప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానంద గౌడు, వైస్ ఎంపీపీలు నారాయణ స్వామి, రూప జయకుమార్, సర్పంచ్ ముంతాజ్ అమీర్‌బాషు, బేలుపల్లి సర్పంచ్ వెంకటేష్, బైరెడ్డిపల్లి సర్పంచ్ కొమ్ము, ఎం.కొత్తూరు సర్పంచ్ రాజారెడ్డి పాల్గొన్నారు.

చక్కనయ్యా...చందమామా...!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:
మనుషులందరికి మేనమామ...చందమామా. చందమామపై అనేక కథలు పుంకాలు పుంకాలుగా ఉన్నాయి. అనేక సినిమాల్లో రకరకాలుగా పాటలు పాడారు. చక్కనయ్యా చందమామా ఎక్కడున్నావో..., జాబిలమ్మ నీకు అంత కోపమా..జాజిపూలపై జాలి చూపుమా.., చందమామాతో ఓ మాట చెప్పాలి, ఓ పాటపాడాలి...రావోయి చందమామా... మా వింతగాథ వినుమా..., చందమామా రావే...జాబిల్లి రావే.., చందురుని మించి అంద మొలకించు ముద్దుపాపాయివే... వెన్నెల రాత్రి... ఇది వెలుగుల రాత్రి...వెన్నెలైనా...చీకటైనా... ఇలా అనేక పాటలు మనకు సుపరిచితమే. నేడు చందమామ గురించి శాస్త్రీయంగా వాస్తవాలు కనిపెట్టేందుకు మరో ముందడుగు వేశారు భారతీయ శాస్త్రవేత్తలు. అందులో బాగంగా నిర్వహించిన చర్యల్లో చంద్రయాన్-3 విజయవంతం కావడంతో దేశం మొత్తం సంబరాలు జరుపుకుంది. ప్రపంచం మొత్తం శభాష్ భారత్ అంది. నగర, పట్టణ వాసులే కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం చంద్రయాన్ -3 ఆసక్తిని రేకెత్తించి, చర్చించుకునేలా చేసింది. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు చంద్రయాన్-3, చందమామ గురించి చెప్పకున్న కొన్ని ముచ్చట్లు యాధాతథంగా....

అది తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని..పాకాల మండలంలో ఉన్న దేశవ్యాప్తంగా సుపరిచుతమైన మ్యాంగోనగర్ (దామల్ చెరుకు)కు సరిగ్గా మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న పచ్చిపాలపల్లి గ్రామం. ఊరుమధ్యన రాగిచెట్టు కిందనున్న అరుగుకు పక్కన వీధి కుళాయి వద్ద సందేలాపూట అమ్మలక్కలు గుమిగూడారు. అప్పటి వరకు నిరంతరాయంగా బుడుక్కు బుడుక్కు మంటూ వీధికుళాయి ద్వారా ప్రవహించిన నీరు.. అప్పడే కరెంట్ ఆప్ కావడంతో తన ప్రవాహానికి కాస్త విశ్రాంతినిచ్చింది. వంటవార్పుల కోసం నీళ్లకొచ్చిన సుమారు డజను మంది ఆడపడుచులూ నీళ్లకోసం నిష్ఠోరంగా నిలుచోని ఉన్నారు. చేతిలో బకెట్, చంకలో బిందెతో అప్పడే అక్కడికి వస్తోంది బుచిరెడ్డి పాపయ్య శెనగసేనులో శెనిగిచెట్టు తొవ్వేందుకు వెళ్లిన పొట్టేటి ఎంకటలచ్చమ్మ. వచ్చిరాగానే అక్కడున్న వాళ్లని పలకరించింది. ఏమే చినపాప అట్టజూస్తుండావు... నీల్రాలేదు. ఆ మాటకు పక్కకకు చూసిన చినపాప స్పందిస్తూ.. ఫీసుకారేజ్‌లో ఫీసు పోయిందని, ఇప్పడే ఎసేదానికి పోయినాడు పెద్దసుబ్బన్న కాసేపట్లో వస్తాదంటే నిల్చోనుండాం అంటూ మాటకలిపారు. కూలీనాళికి పోయినోళ్లంతా ఇప్పడే వస్తాఉండారు. మొగుళ్ల ఇంటికొచ్చే సరికి కాస్త అన్నం వండి పెడితే కదా..పిల్లోలు ఏమో ఆకలంటున్నారు. ముదనష్టం కరెంట్ ఇప్పడే పోయింది. కాస్త నీళ్లొస్తే తినేటప్పడు కావల్సుంటే ఎట్లా పౌర్ణమి దినాలు కదా..చందమామా వెలుతుర్లో కుర్చోని తినేస్తమక్కా... ఈ నీళ్ల ఎప్పడొస్తాయో ఏమో.. అంటూ పల్లవందుకొంది వారిలో ఒకావిడ. చందమామా అనేసరికి గుర్తొచ్చిందక్కా అంటూ అందుకుంది ఏడో తరగతి వరకు చదువకుని డ్వాక్రా సంఘం లీడరుగా ఉంటున్న కోబాకు పల్లవి. మనింజనీర్లు (మన ఇంజనీర్లు) చందమామపైకి రాకెట్‌ను పంపించారంటాక్క... అది మండలం దినాలు (41 రోజు) పోయి పోయి చందమామపైన మొన్ననే దిగిందంటా. ఆ రోజు చూడాలక్క పెదానమంత్రి కాడ నుంచి పసిబిడ్డ వరకు అందరూ ఆదే జూస్తా ఉన్నారు. మన మునిరెడ్డి చెల్లికొడుకు సామిరెడ్డిపల్లి అబ్బాయి గాదంకి కాడున్న రాడర్‌లో పని చేస్తున్నాడంటా.. ఆ అబ్బోడు వచ్చినాడని అందరూ టీవీ దక్కరే కుర్చోన్నారు. సందెకాడ ఆరైంది ఓ..అని అరుపులు..కేకలే.. ఏంట్రా సంగతి అడిగితే. చందమామపై మనోళ్ల రాకెట్ దిగింది అని చెప్పారు. ఇంకనుంచి చందమామపై ఏమి జరుగుతోంది. అది ఎట్టుంది. అక్కడేమేమి ఉండాయి. అన్ని ఆ రాకెట్ పుటోలు తీసి పంపిస్తాదంటా.. కొన్ని పుటోలు జూపించినాడక్క చందమామ పైన తెల్లగా ఉందక్క, మనూర్లో మట్టిలాగ లేదక్క.. అక్కడ మట్టి ఓ రకంగా ఉంది. ఇంక నుంచి మనోళ్ల మద్రాసుకు.. బెంగ్లురుకు పోయిచ్చినంత ఈజీగా చందమామపై వెళ్లోచ్చే రోజులు వస్తాయంట.. అంటూ తను తెలుసుకున్న కొద్ది విషయాలను వారితో పంచుకుంది. ఇక్కడ సేదం లేదు, పట్టణాల్లో పనులు లేవు... ఉన్నా... కూలీ కూడా సక్రమంగా ఇచ్చేరట్టుగా లేదు. పొద్దులుగూకులు కష్టపడి... సాయంత్రానికి పిడికెడు కూడు తిని పడుకునేందుకు కూడా ఇబ్బందులు పడే మనకు చందమామాలు.. రాకెట్లు ఎందుకక్కా... అంటూ నిష్టూరపోయింది. ఇస్కోలు పిల్లలకు అన్నం పెట్టే సుబద్ర. ఇంతలో కరెంట్ వచ్చి..కొళాయిలో నీళ్ల రావడంతో పట్టుకుని వారి వారి దారిన వారు వెళ్లిపోయారు అమ్మలక్కలు.

నగరపాలక సంస్థ ఆర్చీ ఏర్పాటు

ఆర్చీ ఏర్పాటు చేస్తున్న నగర పాలక సిబ్బంది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ మీకు స్వాగతం పలుకుతోంది అంటూ ఏర్పాటు చేసిన ఆర్చీ (స్వాగత తోరణం) ఆకట్టుకుంటుంది. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మార్గనిర్దేశంలో ఇంజనీరింగ్ అధికారులు చిత్తూరు - తిరుపతి మార్గంలో నగరపాలక సరిహద్దు వద్ద చిత్తూరు నగరపాలక సంస్థ - సుస్వాగతం, ధన్యవాదాలు అని ఆర్చ్‌ని ఏర్పాటు చేశారు. ఆర్చ్ ఏర్పాటు పనులు శనివారం పూర్తిచేశారు. నగరపాలక సంస్థ పరిధిలో వెళ్లే ప్రధాన రహదారుల్లో నగర సరిహద్దుల వద్ద సుస్వాగతం ఆర్చీలను ఏర్పాటు చేయడానికి కమిషనర్ చర్యలు చేపట్టారు. చిత్తూరు -పుత్తూరు ప్రధాన రహదారిలో ఇప్పటికే ఆర్చ్ ఏర్పాటు చేయగా, తాజాగా తిరుపతి మార్గంలో ఏర్పాటు చేశారు.

'చంద్రయాన్- 3' భారత్‌కు గర్వకారణం



ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు:చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ప్రపంచ దేశాల్లోనే భారతదేశం ప్రతిష్టకు ఎంతో గర్వకారణమైందని ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. శాస్త్రవేత్తలు కషి కారణంగా చంద్రయాన్- 3 విజయవంతం అయినందుకు గాను మండలం కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామంలోని శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో శనివారం పలువురు విద్యార్థులు ఐఎస్ఆర్ఓ - ఇస్రో అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. పలువురు విద్యార్థులు టీచర్లతో కలిసి కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య ర్యాలీ నిర్వహించారు.

29న ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 29న బెంగళూరు వైదేహి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక ప్రకాశం హైవే రోడ్డులోని శేషపీరన్ మసీద్ ఆవరణలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు అఫ్జల్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో అన్నిరకాల వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోగులకు బెంగళూరు వైదేహి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చిత్తూరు వాసులు కులమతాలకు అతీతంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం ఏడు నుండీ సాయంత్ర నాలుగు గంటల వరకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విజయం డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవం

వార్షికోత్సవ సభలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక మిట్టూరులోని విజయం డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవం శనివారం స్థానిక ఆర్ఎల్ఎన్ కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మధర్‌థెరిసా విద్యాసంస్థల ఛైర్మెన్ రవింద్రబాబు విచ్చేసి మాట్లాడారు. కుటుంబ వ్యవస్థ గురించి వివరించారు. విద్యార్థులు ఎంత ప్రగతి సాధించినా ఉన్నతస్థాయికి చేరినా తమ కుటుంబ సభ్యులతో కనీసం ఖ10 నిముసాలైనా గడపాలని సూచించారు. విశ్రాంతి అధ్యాపకులు దయానందరెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధిన దేశంగా చూడాలని ఆసక్తి నేటి యువతపైనే ఉందన్నారు. ఛాటెడ్ అకౌంటెంట్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ తాను విజయం పూర్వవిద్యార్థి అని 2009లో బీకాం పూర్తి చేసిన్నట్లు తెలిపారు. ఎంతో పేదకుటుంబం నుండి వచ్చిన తాను ఛాటెడ్ అకౌంట్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి నేడు కొన్ని వేలమందికి అడిటర్‌గా సేవలు అందిస్తూ విద్యార్థులకు ఛాటెడ్ అకౌంట్స్‌లో తర్ఫీదులు ఇచ్చే స్థాయికి ఎదిగానని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉద్యోగం చేసే స్థాయి నుండి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతివిద్యార్థి జీవితంలో ఎదగాలంటే సానుకూలదృక్పదం, అంకితభావం, క్రమశిక్షణ, సమస్యలను అధికమించే శక్తి, ప్రజ్ఞా పాఠవాలను అలవచ్చుకోవాలని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజామూర్తి వార్షిక నివేదికను సమర్పిస్తూ 2000 సంవత్సంలో చిన్న కోచింగ్ సెంటర్‌గా ప్రారంభమైన విజయం విద్యాసంస్థలు కెజి నుండీ పీజీ వరకు 7 వేలకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలు అధికమిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో 1,265 మంది ప్రాంగణ ఎంపికలో పెద్ద కంపెనీల్లో మంచి జీతభత్యాలతో ఉద్యోగాలు సాధించిన్నట్లు చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రోజూ షుగర్ రోగులకు ఓపీ ఉచితం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండీ మధ్యాహ్నం 2 గంటల చిత్తూరు గాంధీరోడ్డులో ఉన్న ఇందిరా ఆసుపత్రిలో షుగర్ పెషంట్లకు ఓపి ఉచితంగా చూడనున్నట్లు డాక్టర్ సురేష్ తెలిపారు. డాక్టర్ సురేష్, డాక్టర్ లివిజ నేతృత్వంలో నడుస్తున్న ఇందిరా ఆసుపత్రిలో షుగర్ పెషెంట్ల కోసం ఉచిత ఓపి ప్రతి రోజు నడుపుతున్నారు.

చంద్రబాబును ఆహ్వానిస్తున్న కాజూరు బాలాజీ

చంద్రబాబును ఆహ్వానించిన బాలాజీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు, రాష్ట్రపార్టీ అధ్యక్షుడు అచ్చెంనాయుడు, కష్ణాజిల్లా నూజివీడులో పాదయాత్రలో ఉన్న జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుని చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు బాలాజీ, సోదరుడు రాజేష్‌తో కలిసి ఆయన కుమారుడు వివాహానికి హాజరు కావాలని శుభలేఖను చంద్రబాబుకు అందజేసిన్నట్లు శనివారం ఒక ప్రకటనలో కాజూరు బాలాజి తెలిపారు.

టిడిపిలోకి పలువురి చేరిక

చంద్రబాబు సమక్షంలో టిడిపి చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మంగళగిరి కార్యాలయంలో శనివారం తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జిల్లాకు చెందిన పలువురు వన్నికుల క్షత్రి సంఘం నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరి కండువా కప్పుకొన్నారు. వీరిలో వన్నియాకుల సంఘం నాయకులు టిసి రాజన్, మాజీ సర్పంచ్ తిరుచానూరు, విజయకుమార్, చిత్తూరు కార్పొరేషన్ టాక్స్‌పేయర్స్ సంఘం అధ్యక్షులు కేజీ త్రిమూర్తి, వైఎస్ఆర్ సీపీ లీగల్‌సెల్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ సి.గోపికష్ణ, కష్ణమూర్తి, దేవా, మాజీ కౌన్సిలర్, శ్రీనివాసులు అడ్వకేట్, సిఆర్ తేజేశ్వర్ తమిళ సినిమా హీరో వన్నెకుల సంఘ నాయకులు పార్టీలో చేరారు.

సిసి రోడ్డుకు భూమిపూజ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని బంగారుపాళ్యం దళితవాడలో శనివారం సిసి రోడ్డుకు భూమిపూజ కార్యక్రమం సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు నాలుగు లక్షలతో దళితవాడలో ప్రజల అవసరాల కోసం సీసీ రోడ్డు నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, ఎంపీటీసీ ఉష, మాజీ సర్పంచ్ కష్ణమూర్తి, వైస్‌సర్పంచ్ కామరాజు, గ్రామస్తులు మాణిక్యం, సుబ్రహ్మణ్యం, దేవా, నవీన్ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాయితీ ఉలవ విత్తనాల పంపిణీ

రాయితీ ఉలవ విత్తనాల పంపిణీ చేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి- శాంతిపురం: అబకలదొడ్డి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, జిల్లా పరిషత్ సభ్యులు శ్రీనివాసులు చేతుల మీదుగా రైతులకు రాయితీ ఉలవ విత్తనాల పంపిణీ చేశారు. మండలంలో ఈ ఖరీఫ్‌సీజన్లో భూమికి ప్రత్యామ్నాయపంటగా ఉలవలు సాగు అనుకూలమని, కనుక ప్రభుత్వం మండలంలో బీడు ఉన్న భూములు కలిగిన రైతులు పట్టాదారు పాసుబుక్కు మొబైల్ నెంబర్ల ఆధార్‌లను ఆర్బికే కేంద్రాలలో నమోదు చేసుకుని 80శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలు పొందాలని వ్యవసాయ అధికారి అప్పోజి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి స్థానిక సర్పంచ్ చిన్నప్ప, కోఆప్షన్ సభ్యులు నిసార్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమేష్, ఎంసి డైరెక్టర్ మురుగేష్, రైతులు పాల్గొన్నారు.

సర్పంచుల నిధులు దారిమళ్లింపు దారుణం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజురు చేసిన రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించడాన్ని నిరశిస్తూ శనివారం గాంధీ విగ్రహం ఎదుట సర్పంచుల సంఘం నేతృత్వంలో గ్రామ సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు ప్రకాష్ యాదవ్, ధనంజయ యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల నిధులు దారిమళ్లించడం దారుణమన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి సర్పంచుల నిధుల విషయంలో స్పష్టత ఇచ్చిన తరువాతే బటన్ నొక్కాలన్నారు. నిధుల మళ్లింపై ఫోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు.

'కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి'

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పుంగనూరు మండల పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో బకాయి వేతనాలు చెల్లించాలని శనివారం నిరసన తెలియజేస్తూ అధికారులకు మెమరాండం అందించారు. ఈసందర్భంగా వెంకట్రామయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్స్‌కు చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నుండి చెల్లించాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, స్వచ్ఛభారత్ కార్మికులకు జీవో నెంబర్ 680 ప్రకారం రూ.10వేలు జీతాలు ఇవ్వాలని, స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మధు, ప్రధానకార్యదర్శి గోవిందు, కోశాధికారి కె.రామకష్ణ, కార్యదర్శి వనమల దీన్నే వెంకటరమణ, సభ్యులు, ముని రెడ్డప్ప, చంద్రప్ప, బుడ్డన్న, మేళందొడ్డి నాని కొండప్ప, వెంకటరమణ, మల్లప్ప, రవి పాల్గొన్నారు.

మామిడి సాగులో సస్యరక్షణ తప్పనిసరి

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- కార్వేటినగరం: మామిడి సాగులో సస్యరక్షణ తప్పనిసరి అని జిల్లా ఉద్యోనశాఖ అధికారి మధుసూధన్రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ మామిడి కాయ కోత అనంతరం 15 నుంచి 20 రోజుల పాటు చెట్లకు విశ్రాంతి కలిగించాలన్నారు. అనంతరం తోటలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను తొలగించి సూర్యరశ్మి నలుమూలల పడే విధంగా చూడాలిని, ఎండిన పూతకాడ ద్వారా ఎండు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్ 10 గ్రాములు, ఒక్క లీటర్ నీటితో కలిపి పూయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఒక లీటర్ నీటికి కాఫర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలని సూచించారు. బెరడు తొలిచే పుగుల నివారణకు పెట్రోల్ లేదా క్లోరిపైరిఫాస్తో దూదిని తడిపి ఉంచి రంధ్రాలను బంకమట్టితో కప్పివేయాలని తెలియజేశారు. ఏపీఎంఐపీ పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు 80 శాతం, రెద్ద రైతులకు 70 శాతం రాయితీపై డ్రిఫ్ పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు డేటా సెంటర్ శాస్త్రవేత రెడ్డిరాధ, ఉద్యాన శాఖ ఆర్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు మాట్లాడుతూ మామిడితోటలో జనుము, జీలుగ వేసి కలియదున్నాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసీ వైస్‌చైర్మన్ గోపి, మైస్సార్సీపీ మండల కన్వీనర్ శేఖర్రాజు, ఏవో హేమలత, ఓఈవోలు గాయత్రి, హిమాద్రి. మామిడి రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మనోహర్ రెడ్డి

ప్రజాశక్తి- యాదమరి చిత్తూరు జిల్లా వైయస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా మాదిరెడ్డిపల్లి మనోహర్ రెడ్డి నియమితులయ్యారు. వైయస్సార్ పార్టీ నాయకులు సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు మనోహర్ రెడ్డికి జిల్లా వైఎస్ఆర్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల శనివారం ఆయన స్వగహంలో పలురు వైసిపి నాయకులు కార్యకర్తలు ఆయనకు పూలమాలవేసి దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా పదవి ఇవ్వడం పట్ల పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు జిల్లా జడ్పీ చైర్మన్ బి.ధనుంజయ రెడ్డికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలుపుతున్నాను. తనపై బాధ్యత మరింత పెరిగిందని, 2024 ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ విజయానికి నాసాయశక్తుల పనిచేసి పార్టీని అధికారంలో తీసుకొస్తామని తెలిపారు.

'టిడిపి నాయకులపై కేసు నమోదు చేయండి'

మండల సోషల్ మీడియా టీం ఫిర్యాదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: నారా లోకేష్ రెండు రోజులు క్రితం పాదయాత్రలో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా, శాంతి భద్రతలకి విఘాతం కలిగించేలా, రాష్ట్రంలో అల్లర్లు సష్టించే విధంగా ప్రేరేపిస్తున్నారని పలమనేర్ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె, పుంగునూరు, మాచర్ల లాంటి సెన్సిటివ్ నియోజకవర్గాలలో గొడవలు చేస్తున్నారని, రానున్న రోజుల్లో ఇది ఇంకా ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని అన్నారు. కనుక నారా లోకేష్, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడు, ఎవ్వరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారి మీద తగినచర్యలు తీసుకోవాలని మండల పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐకి ఫిర్యాదు చేశారు. వారి వెంటన మండల సోషల్ మీడియా కన్వీనర్ జనార్ధన్, కో కన్వీనర్ పురుషోత్తం, రెడ్డి ప్రసాద్, శంకరాచారి, రెడ్డప్ప, పన్నీర్ సెల్వం, సతీష్ బాబు, తులసిరామ్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం మాజీ సర్పంచ్ ఎర్రచేను వద్ద ట్రాక్టర్ బోల్తా పడటంతో మృతి చెందారు. గంగాధర నెల్లూరు మండలం వింజం పంచాయతీ పాతూరునత్తంకు చెందిన కష్ణమండడి కుమారుడు మాజీ సర్పంచ్ ఆనంద్ (36) పాతూరు నత్తం గ్రామం నుండి చింతారెడ్డిపల్లి ఎర్రచేనుకు ట్రాక్టర్‌లో ఇటుకరాయి లోడ్‌తో వెళు తుండగా మార్గమధ్యంలో బ్రేక్ ఫెయిల్యూర్ కావడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈఘటనలో కూలీలు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈనెల చివరి వరకూ టీకాలు

పశుసంవర్ధశాఖ ఏడీ ప్రభాకర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల చివరివరకు పశువులు, మేకలు, గొర్రెలకు సంక్రమించే వ్యాధి నివారణ టీకాలు బ్రోస్‌ఎల్లోసిస్ వేయనున్నట్లు పశుసంవర్ధశాఖ ఏడీ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. పశువుల నుండీ మనుషులకు సోకే ఈవ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ స్థాయి అందించే వ్యాధినిరోదక టీకాలు జిల్లాలో నేటి వరకు 75 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈనెల చివరి నాటికి మిగిలిన టీకాలు వేసే కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గర్భస్రావం అయిన పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని వైద్యచేసే సమయంలో పశువైద్యలతో పాటు రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాస్కులు, గ్లౌజులు ధరించి వ్యాక్సిన్ అందించాలన్నారు.

సాయిబాబా ఆలయంలో

16వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కార్వేటినగరం: సాయి బాలాజీనగర్లో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాధుని ఆలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయంలో వేద పండితులు వేద మంత్రాలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. డిప్యూటి సిఎం నారాయణస్వామి కుమార్తె కపాలక్ష్మి, అనిల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతులు శాలువ కప్పి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదలను అందించారు. బెంగళూరుకు చెందిన మాధవరాజు వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, శేఖర్ రాజు, పట్నం ప్రభాకర్రెడ్డి, ధనంజయరెడ్డి, రాజశేఖర్, చిరంజీవిరెడ్డి, శేషాద్రి, పురుషోత్తం రాజు పాల్గొన్నారు.

టాక్స్ చెల్లింపుదారులకు అవగాహన సదస్సు

తిరుపతి సిటీ : తిరుపతి సేల్స్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోషియేషన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సేల్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ట్యాక్స్ చెల్లింపుదారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక హోటల్ కెన్సెస్ తిరుపతిలో టాక్సేషన్‌పై ఒక రోజు సెమినార్‌ను తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ప్రారంభించారు, ట్యాక్స్ చెల్లింపు దారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లారు. కొన్ని కొత్త రక జీవోల్ను, ప్రభుత్వాలు ఇస్తున్న నోటీసుల పై స్పష్టత కావాలని కోరారు. దీనిపై ఇన్కమ్ టాక్స్ అధికారులు , అసోసియేషన్ పెద్దలు సందేహాల నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాన్ స్టీవెన్‌సన్ పాత్ర- జాయింట్ కమీషనర్ సేల్స్ టాక్స్, చిత్తూరు. జితేంద్ర, అసిస్టెంట్ కమిషనర్, సెంట్రల్ జీఎస్టి , తిరుపతి సదస్సు ఛైర్మన్ టి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'రెవెన్యూ' అధికారులకు సర్వే పరీక్ష

తిరుపతి టౌన్ : ఈ నెల 27న ఆదివారం శ్రీ గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుపతి నందు గ్రామ రెవెన్యూ అధికారులకు సర్వే పరీక్ష జరగనుంది. అభ్యర్థులకు జెసి డికే బాలాజీ పలు సూచనలు చేస్తూ పరీక్ష హోల్ నందు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

సీఎంకు నాయీబ్రాహ్మణుల కృతజ్ఞత

తిరుపతి(మంగళం): రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తూ కీర్తి గడించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తిరుపతి నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి నగర కమిటీ అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో నాయిబ్రాహ్మణులకు అవకాశం ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. రాష్ట్ర నాయిబ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్ గా ఉన్న సిద్ధవటం యానాదయ్యకు టిటిడి పాలక మండలి లో చోటు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అనంతరం జ్యోతిరావుపూలే విగ్రహానికి అధ్యక్షులు గుండ్లూరు మహేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణులు రవిచంద్ర, సురేష్, చలపతి, పవన్, కమల్, నాగార్జున పాల్గొన్నారు.

మంజునాథ్‌కు సన్మానం

మంజునాథ్‌ను సన్మాస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-గుడిపల్లి: సైకిల్ యాత్ర విజయం చేయడంతో తూర్పు రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గుడిపల్లి మండల పంచాయతీ పార్టీ అధ్యక్షులు జి.మంజునాథ్‌ను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిపల్లి పంచాయతీలో కుప్పం నియోజకవర్గంలో సైకిల్‌యాత్రను సుమారు 20 రోజులపాటు కొనసాగుతూ చివరగా గుడిపల్లి మండలంలో నిర్వహించడం గర్వకారణమని అన్నారు. మండలంలోని 18 గ్రామపంచాయతీలో మహిళలు, యువత అపూర్వస్పందన తెలిపారని ఆయన పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడును లక్ష మెజార్టీతో గెలిపించే లక్ష్యంగా సైకిల్‌యాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు.

అర్జున్ రెడ్డిని సత్కరించిన నూకతోటి రాజేష్



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా ఇన్‌ఛార్జి అర్జున్‌రెడ్డిని శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నూకతోటి రాజేష్ బృందం హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెన్ అకాడమీ ఉపాధ్యక్షులు భానుప్రకాష్‌ర ఎడ్డి, ఆర్‌వి.రమణఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈవో-2

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని దలవాయిపల్లె ప్రాధమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు భాషాదినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 హెచ్ఎల్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కషి వల్లనే వ్యావహారిక భాషాలో పాఠ్యాంశాలు వచ్చాయని తెలిపారు. తెలుగు భాష అభివద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు ఎంతో కషిచేశారని తెలిపారు. అనంతరం ఎంఈవో, ఎస్టీయూ జిల్లా ఆర్థికకార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యంపిల్లై వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ ఎం.సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు దినకర్, దయ, పద్మజ, రాధిక పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సీఎం కావాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు షేక్ జిలాని బాష

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు షేక్ జిలాని బాష ప్రజాసంకల్ప యాత్ర చేపట్టారు. శనివారం బంగారుపాళ్యంకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమాలతో సంక్షోభం నుండి సంక్షేమం వైపు నడిపిన వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తిరిగి రాబోవు ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావాలని సంకల్పంతో పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఆయనకు మండల వైఎస్ఆర్సిపి నాయకులు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శిరీష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దారు, మాజీ సర్పంచ్ మస్తాన్, బలిసిపల్లి బాబు, షేక్ చాను బాషా, షాకీర్, నౌషాద్ పాల్గొన్నారు

'అమర రాజా స్కిల్ డెవలప్మెంట్'లో దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి : అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపకార వేతనంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్థాపించారు. ఇప్పటివరకూ 14 బ్యాచ్‌లుగా 1314 మంది నిరుద్యోగ యువత తమ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంస్థలోనే పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. ప్రస్తుతం 17 బ్యాచ్‌ల్లో 1230 మంది శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఎంపికైన విద్యార్థులకు శిక్షణా కాలంలో మూడు నెలలకు 7,500, తదుపరి 21 నెలలు 11,453 నుంచి 11853 మంది వరకూ ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ౮9000024919, 9100477371 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.